మేటి బంతి



పంతుల జోగారావు

చిన్నారావు ఆఫీసులో ఫైల్సు చాటు చేసుకుని స్వంత లెక్కలేవో వేసుకుంటున్నాడు. అతని తలమీద ఫాను ఈడుస్తున్నట్టుగానో, ఏడుస్తున్నట్టుగానో గరగరలాడుతూ తిరుగుతోంది నిరుద్యోగులకు ఇంద్రభవనంలాగానూ, చిరుద్యోగులకు యమసదనంలాగానూ కనిపించే ఆఫీసు భవనంలో తానున్న ఆ గది అతని కిప్పుడు యిరుగ్గా ఇబ్బందిగా ఉంది. అతని చేతి వాచీ పని చెయ్యటంలేదు. టైమెంత అయి ఉంటుందో ? చిన్నారావుకి మనసంతా చికాగ్గా ఉంది. పేరుకుపోయిన ఫైల్సు అతనికి భయాన్ని కలిగిస్తున్నాయి. పక్కసీట్లోకి చూసాడు అందమయిన నాగరత్నం షోగ్గా కూర్చుంది. ఆమె చేతి వ్రేళ్ళు టైపుమిషన్ కీబోర్డుమీద మెరుపు తీగెల్లా కదులుతున్నాయి. "వాటే ప్రెటీ గళ్ !" అనుకున్నాడు చిన్నారావు. అతని కా సమయంలో

చప్పున భార్య అనసూయ గుర్తు కొచ్చింది.

చిల్లర డబ్బులకోసం చొక్కా జేబులు తడిమే ఆమె చేతి వ్రేళ్లు, మొద్దుల్లాగా, అతనికి గుర్తొచ్చి చిరాగ్గా నిట్టూర్చాడు.

నాగరత్నం అతనివేపు నవ్వుతూ చూసి, "ఏమిటి చూస్తున్నారు రావు గారూ ?" అంది.

"అబ్బే... టైము ... నా వాచీ ఆగి పోయింది ..." నంగిగా అన్నాడు చిన్నారావు. "మూడూ ఇరవై అయిం దండీ."

"థాంక్స్." వాచీ దిద్దుకున్నాడు చిన్నారావు. తిరిగి తన లెక్కల గొడవలో పడ్డాడు. ఆ రోజు జీతాల రోజు. జీతం తీసుకోడానికి యింకా సేపట్లో అతనికి పిలుపొస్తుంది. అన్ని రకాల కోతలూ పోగా చేతికి అందేవి రెండువందల తొంభై రూపాయలు. తను చేసిన అప్పులు తీర్చడానికీ, తన ఖర్చులకీ అవెలాగూ సరిపోవు. ఎవరి బాకీలు తీర్చాలో, ఎవరికి వాయిదా పెట్టాలో ఆలోచిస్తున్నా డతను. వ్రాయడం, కొట్టెయ్యడం, మళ్ళీ వ్రాయటం ... చిన్నారావుకి ఆ జాబితా ఒకంతకి తెమిలేలా తోచలేదు అతనికి జీతంమీద, జీవితంమీద కూడా కోపం ముంచుకు వస్తోంది.

ఎర్ర సిరా పెన్ను తీసి తను వ్రాసిన దానిమీద అడ్డంగా ఓ గీత గీసి కొట్టేసాడు.

అలా చేసాక పెన్ను టేబిలుమీద పెట్టి మెటికలు విరుచుకుని ఆలోచిం చాడు. వెంటనే పెన్ను తీసి ఆ క్రిందన ఓ వాక్యం వ్రాసాడు : మిత్రులతో పార్టీకి నలభై రూపాయలు...

చిన్నారావు గుండె ఝుల్లుమంది ! అతని చేతన స్తంభించిపోయిన ట్లయింది. పెదిమలు తడి చేసుకున్నాడు. నలభై రూపాయలు ! ఈ జీతంలోంచి అంత మొత్తం పార్టీకోసం ఖర్చు చేసెయ్యడమే ?

కాని...కాని తప్పదు ... ఎప్పుడూ వాళ్ళూ వీళ్ళూ యిచ్చే పార్టీలలో తేరగా పాల్గొని మజా చెయ్యడమేకాని తనెప్పు డయినా ఒక్క పైసా ఖర్చు చేసాడూ ? ఏం బాగుంటుంది ! అప్పటికీ ఆ రంగనాథం అక్కసు పట్టలేక అనేసాడు కూడా ! "ఈసారి పార్టీ మన చిన్నా రావుగా రిస్తారు ... ఏమంటారు రావు గారూ !ఓ. కె ?"

మండుతున్న గొంతుని చేత్తో రాసు కుని వేయించిన జీడిపప్పు నవుల్తూ ఆ ఉత్సాహంలో "ఓ యస్ దాన్దేముంది !" అనేసాడు తను. ఛ ... ఎంత నాసి రకంగా చూసినా కనీసం నలభై రూపాయలయినా ఈ సాయంత్రం ఖర్చు చేయాలి తను ... గుట్టుచప్పుడు కాకుండా ఏ సినిమాకైనా చెక్కేస్తేనో? ఛ...ఎంత అప్రతిష్ఠ ! అంతా ఏమను కుంటారు !... వెధవ ... డర్టీ డెవిల్

ఆ రంగనాథంగాడు తనని ఛాలెంజ్ చెయ్యడానికే అలా అన్నాడు. వాడి దగ్గర తను చులకనై పోకూడదు. ఎంత ఖర్చయినా సరే వెనుదియ్య కూడదు...

లెక్కలు వేసిన కాగితాన్ని నలిపి ఉండగా చుట్టి చిత్తుబుట్టలో పారేసాడు.

"సార్."

తలెత్తి చూసాడు.

"బాస్ రమ్మంటున్నారు సార్."

చిన్నారావు గుండెల్లో రైళ్లు.

"పద ... పద ... " సీట్లోంచి లేచాడు. "నమస్తే సార్."

"యస్ ... యస్ ... ఆఁ చూడు చిన్నారావ్ ... మా అమ్మాయి సునీత లేదూ, రేపు టెన్త్‌ని తోటపల్లి టెంపుల్‌లో అమ్మాయి మారేజ్ చేస్తున్నామోయ్ ... ఇదిగో వెడ్డింగు కార్డు ... మీరంతా సహకరించాలి సుమా !"

చిన్నారావు వినయంగా కార్డు అందు కున్నాడు. ముఖానికి నవ్వు పులుముకుని "అమ్మమ్మ ! ఎంత మాట సార్ .. మా యింట్లో కార్యంలాగా పని చెయ్యమూ ! సంతోషం సార్" అన్నాడు.

బాస్ దగ్గరనుంచి తిరిగి తన సీట్లోకి వచ్చేడు చిన్నారావు. ఆఫీసరు గారమ్మాయి పెళ్ళికి ఎంత కటింగవు తుందో ?! అతని మనసు బెంగగా పీకుతోంది. పులిమీద పుట్రలాగా ఈ ఖర్చొకటి యీ నెలే వచ్చి మీదపడాలా! చిన్నారావుకి అసహనంగా ఉంది. తన కోపం ఎవరినీ ఏమీ చెయ్యలేదని తెలుసు కనుక దిగులుగా నిట్టూర్పు విడిచాడు.

ఆ తరువాత అతను జీతం అందు కున్నప్పుడు స్టాఫ్ సెక్రటరీ వచ్చి "బాస్ వెడ్డింగు యిన్విటేషన్ యిచ్చారు కదూ రావుగారూ! మన స్టాఫంతా కలిసి మంచి ప్రజంటేష నివ్వాలి అందుకని ఒక్కొ క్కరి దగ్గరా ఇరవై రూపాయలు కట్ చేస్తున్నాం..." అని చల్లగా చెప్పాడు.

చిన్నారావు వంటిమీద కొరడాతో ఛళ్ మనిపించినట్లయింది. ఎదురుతిరుగు తున్న మనసుని అదుపులోకి తెచ్చు కునేందుకు ప్రయత్నిస్తూ రెండు పదులు తీసి అతని చేతిలో ఉంచాడు. ఆ తరువాత విసురుగా ఆ గదిలోంచి బయటపడ్డాడు.

* * *

2

అప్పులవాళ్ళకి ముఖం చాటేసి అడ్డదార్లు తొక్కుతూ దీపాలు పెట్టే వేళకి యిల్లు చేరాడు చిన్నారావు.

చొక్కా తీసి చిలక కొయ్యకి తగి లించాడు. పెరట్లో కెళ్ళి సబ్బుతో ముఖం కడుక్కున్నాడు.

ఇవాళ ఎలాగయినా మిత్రులకి తను పార్టీ చేసి తీరాలి ఇవాళ చెయ్యలేక

పోతే మళ్ళీ మొదటి తేదీవరకూ తన చేతిలో ఒక్క పైసా ఆడదు...

ఆఫీసులో కుర్రకారంతటికీ వయసులో తనే పెద్ద. మొదట్లో తనేమిటో తన పనేమిటో అని ఉండేవాడు. కాని ఎవరితోనూ మెలగక అలా వంటరిగా డల్‌గా ఉండటం తనకీ కష్టంగానే ఉండేది.

రాఘవరావు, మూర్తి, రంగనాథం, వెంకటచయనులు వీళ్ళంతా సరదాగా నవ్వుతూ కులాసాగా తిరుగుతూ ఉంటే తనొక్కడే కట్టి పడేసినట్లుండటం తనకీ చిరాగ్గానే ఉంది. ముఖ్యంగా నాగరత్నం జాయినయేక వాళ్ళ ఉత్సాహం మరింత ఎక్కువయింది. వాళ్ళందరూ ఒకటిగా సరదాగా ఉంటే తనుమాత్రం గోడకి కొట్టిన మేకులా స్తబ్దుగా ఉండిపోవటం చాలా యిబ్బందిగా ఉండేది.

నెమ్మదిగా వాళ్ళతో కలిసి తిరగటం మొదలుపెట్టాడు. వాళ్ళతో కలసి సినిమాలు చూడటం, షికార్లు చెయ్యడం ప్రారంభించాడు.

చివరికి ఓమారు వాళ్ళతో మొదటి సారిగా పార్టీలో గొంతు తడుపుకున్నప్పుడు అసహ్యంగా, క్రొత్తగా అదో రకంగా తోచింది...

వ్యసనం ప్రారంభమవడం అంటూ జరిగితే ఎంత ప్రమాదమో తెలుసుకోలేకపోయాడు. వాళ్ళెవరికీ డబ్బు యిబ్బందులు ఉన్నట్టే తోచదు. ధారాళంగా ఖర్చుపెడుతూ ఉంటారు. చిన్నారావుకి వాళ్ళ పార్టీలలో పాల్గొనడం ఒక సరదాగా ప్రారంభమై అరికట్టలేని వ్యసనంగా పరిణమించింది...

ముఖం కడుక్కొని, తువ్వాలుతో తుడుచుకుంటూ గదిలోకి వచ్చిన చిన్నారావు దృష్టి తన జేబులు సవరిస్తున్న భార్యమీద పడింది...

"ఏమిటే ... ఏఁవిటాపని ?" అని కసిరాడు.

అతని భార్య ఇలాంటి గర్జనలకి భయపడటం ఎప్పుడో మానేసింది.

"మీ షికార్లకీ, సినిమాలకీ వచ్చిన జీతమంతా తగలెయ్యకుండా జాగ్రత్త పడదామని ..." అంటూ ఓ చురక అంటించింది.

"నోర్ముయ్ ... నేను దుబారా చేస్తున్నా ననా నీ ఉద్దేశం ?" చిన్నారావు చిందులువేస్తూ అరిచాడు.

"లేదు...లేదు... ఈ కొంపకోసమే అన్నీ చేస్తున్నారు కదూ ! ఛీ... సిగ్గు వెయ్యటంలేదూ మీకు ? ఇంట్లో ఎదిగిన ఆడపిల్ల ఉందన్న సంగతి మీకెప్పుడయినా పట్టిందా ? చెట్టంత కొడుకు అదుపు తప్పి చిల్లర తిరుగుళ్ళు తిరుగుతూ ఉంటే పట్టించుకున్నారా ! ఆ చంటి వెధవకి అక్షరం ముక్కయినా రాక చెడిపోతూ ఉంటే వాడ్ని దగ్గరకు పిలిచి ఓసారయినా మందలించిన

పాపాన పోయారూ ? కొంపెలా గడుస్తుందన్న ఆలోచనయినా మీకుందా ? ఈ నెల మరింక నేను వాళ్ళదగ్గరా వీళ్ళదగ్గరా అప్పులు తేలేను ... ఏం చేసుకుంటారో మీ యిష్టం..." అన సూయ కళ్ళవెంట నీళ్లు దుఃఖంతో ఉబికి వస్తున్నాయి.

భార్య కన్నీళ్ళు చూసి చిన్నారావు కొంచెం చలించినా, తను చెయ్యవలసిన పార్టీ సంగతి గుర్తుకు రాగానే తిరిగి శివమెత్తిపోయాడు.

"ఆపవే, వెధవరాగాలు ... ఎందుకలా పెడబొబ్బలు పెడ్తావ్ ? ఏదీ. అందులోంచి యాభై రూపాయ లిలాతే—తక్కిందాంతో యింటి ఖర్చులు చూసుకో" అని జీతంలోంచి ఐదుపదులు

తను తీసుకుని తక్కినది భార్య చేతిలో ఉంచాడు

"నా నెత్తిలా ఉంది - ఈ డబ్బులు ఏ మూలకి సరిపోతాయండీ - పాల వాడికి రెండొంద లివ్వాలి - కిరాణా కొట్టువాడికి క్రితంనెల బియ్యం డబ్బులు యింకా యివ్వనేలేదు - వాడింక మరొక్క పైసా అరువియ్యడు...ఇంట్లో దినుసులన్నీ నిండుకున్నాయి..."

"అయితే నన్నేం చెయ్యమంటావ్ ? ఏట్లోపడి చావమంటావా ?" తన మాటలు తనకే అవహ్యంగానూ, వికృతంగానూ తోచేయి చిన్నారావుకి. ఎంత బాధ్యతారహితంగా అనగలిగేడు తను! కాని ... ఆ సత్యాన్ని అంగీకరించ గలిగే ధైర్యం చిన్నారావులో యిప్పుడు లేదు.

బాధ్యతలనుంచి, బరువులనుంచి, బెంగలనుంచి, ఆ యింట్లోంచి-ఎక్కడి కయినా వెంటనే పారిపోవాలనిపిస్తోం దతనికి. ఒక పెద్ద అబద్ధం ఊబిలోకి- కమ్మని కలలోకి-నిషా ప్రపంచంలోకి - పరిగెత్తి పారిపోయి, అది ఊపి రాడ నివ్వని ఊబికావచ్చు కాని అందులో కూరుకు పోవాలనిపిస్తోందతనికి...

తనని చుట్టుముట్టి బుసలు విడుస్తున్న ఆలోచనల పాముల దాడికి తట్టుకోలేక పోయాడతను

చెప్పులు తొడుక్కుని, జుత్తు చేత్తో సవరించుకుని, వీధిలోకి వచ్చి పడ్డాడు. అతని జేబులో యిప్పుడు యాభై రూపాయలున్నాయి. పైన కొంచెం చిల్లర కూడా ఉంది కిళ్ళీ కొట్లో సోడా త్రాగి వక్కపొడి నములుతూ సిగరెట్ వెలిగించాడు.

ఇప్పుడు మొదట రాఘవరావు దగ్గరికి వెళ్ళాలి అక్కడికే తతిమ్మా ముగ్గురూ వస్తారు.

'ఇవాళ పార్టీ ఖర్చు తానే భరిస్తా' నని గర్వంగా చెప్పాలి. అప్పుడు వాళ్ళ ముఖాలలో ఆశ్చర్యం చూడాలి. ముఖ్యంగా రంగనాధం - ఆ వెధవ - వాడి ఫీలింగ్స్ చూడాలి ... వాడ్నివాళ చిత్తుచేసెయ్యాలి...

ఆలోచిస్తూ నడుస్తూన్న చిన్నారావు కాళ్ళు హఠాత్తుగా ఆగిపోయాయి. ఉద్రిక్తతతో అతని రక్తం తిరగబడింది. పళ్ళు గిట్టకరచుకుని చూసాడు.

ఎదురుగా కూతురు నిర్మల- రాఘవరావులు ! నవ్వుతూ, కబుర్లు చెప్పుకుంటూ- ప్రపంచాన్నే లెక్కచేయనంత ధీమాతో ఒకరిపై ఒకరు ఒరిగిపోతూ-

బిగించిపట్టిన పిడికిలిలో చిన్నారావు అరచెయ్యి చెమటతో ముద్దయిపోతోంది.

తండ్రిని ఆ సమయంలో చూసి నిర్మల భయంతో చిన్నగా వణికింది. రాఘవరావు చలించినా, నిభాయించుకున్నాడు. విష్ చేసాడు "హల్లో రావు గారూ ! మీ యింటికే వస్తున్నాను - యివాళ పార్టీకి రారూ ?" అని.

చిన్నారావు బదులు చెప్పలేదు.

రాఘవరావు నవ్వి, "మీ యింటికి వస్తూంటే నిర్మల సరస్వతీటాకీస్ జంక్షన్‌లో కలిసిందండీ –మేటి నీ చూసి వస్తోందిట –" తాము కలసి రావటానికి సంజాయిషీ యిచ్చుకున్నట్టుగా అన్నాడు రాఘవరావు.

చినా రావు అతనికి జవాబివ్వకుండా "పదండి" అంటూ యింటివేపు దారితీసాడు. ముగ్గురూ యిల్లు చేరారు.

కాఫీ త్రాగేక "పదండి రావుగారూ" అంటూ లేచాడు రాఘవరావు. "మీరు పదండి - నే నొస్తాను" అని అతడిని పంపేశాడు చిన్నారావు.

"తప్పకుండా వస్తారుగా? మేమంతా మీకోసం చూస్తుంటాం" అని నవ్వి వెళ్ళిపోయాడు రాఘవరావు.

రాఘవరావు వెళ్ళిపోయాక చిన్నారావు ఉగ్రుడై నిర్మలవేపు చూస్తూ "ఆ వెధవతో నీకు కబుర్లేమిటే" అని గద్దించి అడిగాడు.

నిర్మల జవాబుగా కళ్ళవెంట నీళ్ళు కుక్కుకుంది. అనసూయ వచ్చింది, "దానిమీద అలా అరుస్తూ విరుచుకు పడతారెందుకండీ ?" అంటూ.

"మా ఆఫీసులో పనిచేసే రాఘవ లేడూ–మనింటికి వచ్చిపోతూ ఉంటాడు –వాడితో కలసి వస్తోంది ... ఆ మీది మీదికి పడి నడుస్తూ కబుర్లేమిటి దీనికి వాడితో..."

"చాల్లెండి-కాస్త గొంతుతగ్గించండి- ఇంతకీ అదేం నేరం చేసిందని అలా గొంతు చించుకుంటారు ? మీ స్నేహితుడే కదా అని కాస్త చనువుగా అతనితో మాట్లాడితే అలా దానిమీద మండిపడతా రేమిటండీ - వయసొచ్చిన పిల్లని అలా నిలవేస్తారేమిటి మరీ" అంది కోపంగా.

చిన్నారావు భార్యమీద విరుచుకు పడ్డాడు.

"వయసొచ్చిన పిల్ల కనుకనే అడుగుతున్నానే బుద్ధిలేనిదానా ! వాడి సంగతి నీకు తెలీదు. వాడికి లేని వ్యసనం లేదు ...ఆఫీసు టైపిస్టు చుట్టూ అస్తమానూ తిరుగుతూ ఉంటాడు - రోగ్ - ఇంటి కొచ్చి పోయినంతమాత్రాన యిదెందుకు వాడితో చనువుగా తిరగాలి ? వాడు బద్మాష్ - తెలుసా ! - పేకాట – తాగుడు ... " చివరి వాక్యాలు అంటున్నప్పుడు అతని కడుపులో వెలితిగా దేవినట్లయింది. నరనరమూ లజ్జా భారంతో ముడుచుకుపోయినట్లయింది. నిర్మల వెక్కి వెక్కి ఏడుస్తోంది. చిన్నారావు విసురుగా కుర్చీలో కూలబడ్డాడు.

ఇదంతా ఎందుకిలా జరుగుతోంది ? తను బాధ్యతలనుంచి పారిపోవటానికి ప్రయత్నించటంవల్లనే కదూ ! చిన్నారావు తలలో ఆలోచనల తూటాలు పేలుతున్నాయి. అతని మనసు నెవరో ఇనుప

తొడుగులతో నొక్కుతున్నట్లనిపించ సాగింది.

కుర్చీలోనుంచి లేచి, బీరువా తలుపు తెరచి జేబులో ఉన్న డబ్బు అందులో ఉంచాడు. బీరువా తలుపులు మూయబోతూ ఉంటే అతని దృష్టి ఓ కవరుమీద పడింది. కవరు తీసి చూసాడు. పెద్ద కొడుకు రవి ఉద్యోగానికి పంపించాల్సిన అప్లికేషను ఫారం అది. అది పంపవలసిన గడువు నిన్నటితోనే ముగిసిపోయింది.

భార్యని కేకేసి అడిగాడు: "ఏమే - వీడు ఈ అప్లికేషను పంపించనే లేదేం? ఏవో సర్టిఫికెట్లూ అవీ జతపరచాలని అడిగితే అప్పుచేసి ఓ పదిరూపాయలు కూడా యిచ్చాను - దీన్ని పంపకుండా యిలా పడేసి ఉంచాడేం?" అని.

"ఖర్మ ... నన్నడుగుతా రేమిటండీ?"

చిన్నారావుకి కోపం తారస్థాయి నందుకుంది. ఏమీ చెయ్యలేని అశక్తత అతనిని పట్టి కుదిపేస్తోంది. సమస్యలతో అతని తల బ్రద్దలైపోతున్నట్లుంది కుర్చీలో కూలబడి నుదురు అరచేత్తో రుద్దుకున్నాడు.

* * *

3

కాస్సేపటికి రవి యింట్లోకి అడుగు పెట్టాడు. "ఏరా రవీ - ఆ అప్లికేషను పంపించలేదేం? యింట్లో పెట్టుకూర్చుంటే ఉద్యోగా లొస్తాయనుకున్నావా? ఇచ్చిన పదిరూపాయలూ ఏంచేసావు?" కోపంగా అడిగాడు చిన్నారావు

"అవి ... అవి బస్సులో వస్తూంటే ... ఎక్కడో పోయాయి నాన్నా ..." భయం భయంగా అన్నాడు రవి.

"ఆ సంగతి అప్పుడే ఎందుకని చెప్పలేదు?" అంటూ విసురుగా రవి మీదకి వెళ్ళిన చిన్నారావు - ఎవరో జబ్బ పట్టుకుని ఆపినట్లుగా ఆగిపోయాడు.

అతని నరాలు పేలిపోతున్నట్లు...

అతని మెదడు చిల్లులు పడ్డట్లు...

అతని గుండె బ్రద్దలై సెగలు కక్కుతున్నట్లు...

అతని సమస్త ఇంద్రియాలూ ఎదురు తిరిగి శపిస్తున్నట్లు ... చిన్నారావు దిగ్భ్రాంతిచెంది ఆగిపోయాడు. నోట మాటరాక వెర్రిగా చూస్తూ ఉండిపోయాడు.

రవి దగ్గర - అబ్బ! ముక్కుపుటాలు అదరగొట్టే వాసన! అవును ...ఆ వాసనని తను పోల్చుకోగలడు— తన పతనానికి ముఖ్యకారణమయిన నీచాతినీచమయిన వ్యసనాన్ని బట్టబయలుచేసే దుర్భరమయిన వాసన అది!

రవి...రవి కూడా చెడిపోయాడా?



"భగవాన్!" చిన్నారావు హృదయం కకావికలై పోయింది.

* * * *

చాలా సేపటికి తేరుకున్నాడు చిన్నారావు. ఛీ. తను మారాలి. తను మేల్కొనాలి ... పరిస్థితులనుండి, వాస్తవం నుండి పారిపోకుండా నిబ్బరంగా నిలబడటం నేర్చుకోవాలి. బాధ్యతలను గుర్తించాలి ... మనిషిగా నిలబడగలగాలి...తననీ ఈ కుటుంబాన్నీ కాపాడుకోవాలి...

తన కుటుంబంలో ప్రతి ఒక్కరూ జీవితపు ఒరవడి దిద్దుకోవటానికి మేలుబంతి కావాలిసిన తనే యిలా పతనమయిపోతే వీళ్ళ కెవరు దిక్కు? చిన్నారావు మనసు విలవిలలాడిపోయింది.

ఇంతలో వీధిలో సైకిలు బెల్లు మ్రోగింది.

చిన్నారావు తలెత్తి చూసాడు.

రాఘవరావు పంపిన కుర్రాడు, సైకిలు స్టాండు వేసి వచ్చేడు. "రాఘవరావుగారు మిమ్మల్ని అర్జంటుగా రమ్మంటున్నారండీ - ఇవాళ పార్టీ ఉందిట కదండీ-" అన్నాడు.

చిన్నారావు దిగ్గున లేచి నించున్నాడు. అతని శరీరం ఉద్వేగంతో సన్నగా వణుకుతోంది. అసహనంగా క్రింది పెదవి కరచి వదిలిపెట్టాడు.

రెండు చేతులూ నడుంమీద పెట్టుకుని, దృఢంగా అన్నాడు "నేను రాననీ, రాలేననీ చెప్పు- ఇప్పుడే కాదు, మరెప్పుడూ కూడా ఆ పార్టీలకి రానన్నానని చెప్పు - ఫో !" అని.

ఆ అబ్బాయి తెల్లబోయి, తలూపి సైకిలెక్కి వెళ్ళిపోయాడు.

తను తీసుకొన్న మంచి నిర్ణయం అంత కొత్త బలాన్నీ - క్రొత్త ఉత్తేజాన్నీ యివ్వగలదని చిన్నారావు ఊహించనయినా లేదు !

చిన్నారావు తృప్తిగా నిట్టూర్చాడు.